# కారుమబ్బులో కాంతిరేఖ

డియర్ మిసెస్ అరుణా!

నా పుత్తరం చూసి పులిక్కిపడుతున్నావా! ఇంత అసందర్భంగా నీకు వుత్తరం వ్రాసేదెవరా అని ఆశ్చర్యపోతున్నావా? అసలు నేనింకా గుర్తున్నానా? అవునులే! నేనెలా గుర్తుంటాను? చందమామ ఎన్ని తారకల మధ్యనున్నా ప్రత్యేకంగానే కనబడుతుంది. మరి నేను - ఎన్నో నక్షత్రాలల్లో ఒక నక్షత్రకుణ్ణి. ఆనాడు నీ చూపు కోసం తపించి పోయిన చాలామందిలో - నేనూ ఒకణ్ణి. నీకు ప్రేమలేఖలు వ్రాసిన, ఎంతో మందిలో ఒక అభాగ్యుణ్ణి. అందరితో పాటూ-నన్నూ ఒక రౌడీ వెధవగా జమకట్టి-దూరంగా కసిరి కొట్టావ్. కాని-మళ్ళీ ఇప్పుడు కూడా చెబుతున్నాను-నేను నిన్ను హృదయ పూర్వకంగా ప్రేమించాను - ఇంకా ప్రేమిస్తున్నాను. నా ప్రేమ పాఠాలు వల్లించి బోరు కొడుతున్నానా! సరేలే! ఇప్పటికైనా! మై డియర్ మిసెస్ అరుణా! నేను - నేను, నీ పలకరింపు కోసం పలవరించిన ప్రభాకర్‌ని - నీ క్రీగంటిచూపు కోసం! కాచుకున్న నీ ఓల్డు క్లాస్‌మేట్‌ని. నీ అధరాల మీద చిరునవ్వు కోసం-పిచ్చిగా తిరిగిన ఓ ప్రేమికుణ్ణి. నాకూ అందం వుంది. చదువూ వుంది-ఆస్తీ వుంది-అంతకుమించి ప్రేమించే హృదయం వుంది. నా హృదయం విప్పి - చెప్పిన నా ప్రేమలేఖను చదవనన్నా చదవకుండా నిర్లక్ష్యం చేసావ్. నన్ను వంచించావ్. నిన్ను నువ్వే మోసం చేసుకున్నావ్. నేను వ్రాసింది ఒకే ప్రేమలేఖ అవొచ్చు-కాని నీకు ప్రతిరోజూ వచ్చే "ఫాన్ మెయిల్"లో అదొకటి! కాలేజీ బ్యూటీగా పేరు తెచ్చుకొని-ఒక చిరునవ్వు విసిరితే కాళ్ల మీద పడే-డజన్లకొద్దీ ఆరాధకులతోపాటు-నన్నూ ఒకడిగా జమకట్టావ్ అదే నా బాధ!

అరుణా! నీకు జ్ఞాపకముందా! ఆరోజు ఆడిటోరియం దగ్గర నిన్ను వంటరిగా కలుసుకున్నాను! నువ్వు భయపడ్డావ్! నా ప్రేమని చెప్పాకున్నాను- పెద్దగా నవ్వావు. ప్రార్థించాను కనురెప్పతో పరిహసించావ్! నన్ను కాదంటే పిచ్చివాణ్ణయి పోతానన్నాను. కనురెప్పలు టపటపలాడించి అప్పుడే పిచ్చివాణ్ణి చూసినట్టు చూశావు! నీవు లేక నేను లేనన్నాను. కసిరి కొట్టావ్ -కాని నేను నిన్నంత అధికంగా ప్రేమించటం వల్లనే - నీవు నన్ను నిర్లక్ష్యం చేసినా-నేనేమి చేయలేకపోయాను. ఒకటి మాత్రం గుర్తుంచుకో - నేను నీ హృదయాన్ని గాక, శరీరాన్నే ప్రేమించిన వాడినయితే-ఆరోజు ఏమైవుండేదో తెలుసా! నువ్వేమయివుండేదానివో తెలుసా! చుట్టూ! చీకటి ఆవరించి వున్న ఆడిటోరియం-ముందు-నువ్వూ-నేనూ - అరచి గీపట్టినా ఆలకించే నాథుడు లేడు-నీ శరీరమే నాకు ప్రధానమయితే ఆ నిముషానా నిన్ననుభవించేవాడిని-నువ్వు బాహువుల్లో నలిగి-నశించి వుండేదానివి. నన్ను కాదని-రెచ్చగొట్టిన నిన్ను - సర్వనాశనం చేసివుండేవాణ్ణి కాని... కాని.... ఏమీ చేయలేకపోయాను! ఎందుకో తెలుసా! నువ్వు పాడయిపోవటం నా కిష్టంలేక! నన్నర్థం చేసుకోలేక పోయినా - నిన్ను చూసి జాలి పడ్డాను ! - నా దౌర్భాగ్యానికి చింతించాను.

తరువాత కొన్నాళ్ళకు-నీ వివాహం జరుగుతున్నదని తెలిసి విలపించాను. నీభర్తగా వచ్చే ఆ అదృష్టవంతుడిని చూసి ఈర్ష్య పొందాను. పిచ్చిగా అటూ ఇటూ పరుగెత్తుదామనుకున్నాను. వికటాట్టహాసం చేద్దామనుకున్నాను. - నిన్ను బలవంతంగా తీసుకుపోయి-వివాహం చేసుకుందామనుకున్నాను. కాని అరుణా! నీ సుఖమే నాక్కావాలి నన్ను ప్రేమించని నిన్ను వివాహమాడితే నువ్వేం సుఖపడతావు? నీకు లేని సుఖాన్ని నేనేం పంచుకునేది? అందుకనే-నీ సుఖమే నా సుఖమనుకున్నాను. నువ్వు అత్తగారింటికి వెళ్తుంటే బాధపడ్డాను- నీ యెర్రని అధరాల మీద అందమైన చిరునవ్వునిక చూడగలనా అని కలవరపడ్డాను-నీవు వెళ్ళిపోయాక-నాకు పగలు రాత్రి ఒకటిగానే కనిపించసాగినయ్! లోకమంతా చీకటిగానే కన్పించింది! ఆ చీకటిలో వెలుగుని ప్రవేశపెట్టటానికి మా వాళ్ళు చాలా ప్రయత్నం చేశారు-అయినా వెన్నెల లాంటి నీ ముందు వారేపాటి? అందుకే నిశ్చయించుకున్నాను - ఈ జన్మకి పెళ్ళి మాట తలపెట్టకూడదని! నాకు నువ్వే కావాలి! అరుణా-నువ్వే కావాలి. నన్ను నిర్లక్ష్యంచేసి వెళ్ళిపోయినా- ఇంకా నువ్వే కావాలని వాంఛించటం హాస్యాస్పదమే కావచ్చు! కాని ఏం చెయ్యను? నీకు తప్ప నా హృదయంలో వేరొకరికి చోటేలేదు. నాకు ఏం చెయ్యటానికి తోచేది కాదు. అదోలా ఉండేది. ఒకరోజు మరీ పిచ్చెత్తి నట్లయిపోయి వెంటనే నిన్ను చూడటానికి-మీ ఊరికి బయల్దేరాను. నువ్వూ శ్రీవారూ-సినిమాకి కాబోలు బయల్దేరారు. దూరం నించి-నీ ప్రక్కన హుషారుగా నడుస్తున్న ఆయన్ని చూసి-కుతకుత లాడిపోయాను! ఏదో చేసేద్దామనుకున్నాను. నవ్వుతూ సరదాగా-చేతులు కలుపుకుని వెడుతున్న మిమ్మల్ని చూసి మళ్లీ బాధపడిపోయాను. సుఖంగావున్న మీ జంటని విడదీయడం - ముఖ్యంగా నా అరుణ సుఖాన్ని విషాదంతం చేయడం నా కిష్టం లేదు-అందుకే తల వంచుకొని వేగంగా అడుగులు వేశాను. ఆరోజు నువ్వసలు నీ ఆనందంలో నన్ను గమనించి వుండవు-నిన్ను సమీపిస్తున్న కొద్దీ నీ నీలి కురుల సోయగాన్ని వీక్షించాలనీ. నీ గులాబి బుగ్గల వెలుగు జిలుగుల్లో - నా నీడని చూసుకుని పరాధీనవయిన నిన్ను ఇలా సంస్కారరహితంగా వర్ణిస్తున్నందుకు నన్నపార్థంచేసుకోకు అరుణా! ప్రేమంటే తెలియని పిచ్చివాణ్ణి! ఏదో పిచ్చి వాగుడు వాగుతుంటాను! నేను నా భావాలను ఎవరితో చెప్పుకునేది! ఎలా చెప్పుకునేది! విని కనీసం రెండు కన్నీటి బొట్లు వదిలే దెవరు? కనీసం నువ్వయినా ఆ పని చేస్తావని నీకే వ్రాసుకుంటున్నాను! తప్పుగా అనిపిస్తే క్షమిస్తావు కదూ!

నీ భర్త ప్రక్కనే హుషారుగా అడుగులు వేస్తూ కులాసాగా నడుస్తున్న నిన్ను తలెత్తి చూడలేక చకచక నిన్ను దాటుకుంటూ వెళ్ళిపోయాను. తరువాత అనిపించింది. అప్పుడు నీతో మాట్లాడితే పలకరింపుగా చిరునవ్వు నవ్వితే - మరింకేమన్నావుందా? మల్లెపూవులాంటి నీజీవితంలో మండుటెండలు ప్రారంభం కావూ! నువ్వు నన్ను గుర్తుపట్టినా లేకపోయినా, సమాధానం చెప్పినా చెప్పక పోయినా నీ భర్తకు ఆ సంఘటనను భరించే సంస్కారం వుండొద్దూ! నీ భర్తకు అపాటి సంస్కారం లేదనికాదు నేననేది! లోకం తీరు నీకు తెలియంది కాదు! ఎంత సంస్కారం గురించి వుపన్యసించే వాడికైనా తనదాక వస్తేనే తెలిసేది! అదే జరిగితే నా చేతులారా, నేనే నీ సంసారంలో నిప్పులు వేసినవాణ్ణయేవాణ్ణి. అందుకే నేను

గట్టిగా నిశ్చయించుకున్నాను. ఇక జన్మలో నీ కెదురు పడకూడదని! ఎంత కాదనుకున్నా ఎప్పుడూ నువ్వూ, నీ రూపూ నా మదిలో మెదులుతున్నప్పుడు, నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నప్పుడు - హుఁ నాకేంచెయ్యాలో తోచటం లేదు! నేను సరిగా తిండి తింటంలేదని, సరిగా నిద్ర పోవటంలేదని మా అమ్మ కంప్లయింట్! కాని మనసులోని ఆరని మంట చల్లారక మనశ్శాంతి కోసం నేను ఎన్నెన్ని దుర్వ్యసనాలకి లోనయిందీ మా అమ్మకేం తెలుసు? నిన్ను నా హృదయంలోనుంచి చెరిపి వేసుకోలేను! కాదు నీ కెదురు పడలేను! ఆ బాధతోనే నలిగిపోతున్నాను! కృశించి మంచ మెక్కాను. డాక్టర్ కాన్సర్ అన్నాడు ! ఇప్పుడని పిస్తున్నది. నేనో కనుక నిన్ను వివాహ మాడినట్లయితే - వద్దు అరుణా! వద్దు! అంతా ఒక పీడకల. కాని ఒక మరపు రాని మధురమైన కల!

ఇప్పుడు నీకీ ఉత్తరం వ్రాయటంలో ముఖ్యోద్దేశం-నీకర్థమయి వుండదు! కాన్సర్‌తో బాధ పడుతూ- రోజులు లెక్క పెడుతున్నాను. అటువంటి నాకు మనశ్శాంతి కావాలి. ఆ మనశ్శాంతి నువ్వు తప్ప ఈ లోకంలో నా కెవరూ ప్రసాదించలేరు! ఒక్కసారి నా దగ్గరకు రాగలవా! నన్ను ఆప్యాయంగా పలకరించి- హాయిగా సాగనంపగలవా! నన్ను క్షమించు అరుణా! ఏదో బాధతో ఏమేమో వ్రాస్తున్నాను- నువ్వు ఆ పని చేస్తే- నీ సంసారం నాశనం అవుతుంది! నీ భర్త నా బాధని అర్థం చేసుకోలేకపోవచ్చు! అసలు నా బాధ నీకే అర్థం కాకపోవచ్చు! నేనివాళ కాకపోతే రేపు ఖచ్చితంగా పోయేవాణ్ణి! కాని నువ్వు - నీ భర్తతో- కొన్నాళ్ళల్లో పిల్లలతో - సంతోషంగా కాలం గడపవలసిన దానివి-....నేనేం వ్రాయాలో నాకే తెలియటంలేదు. రెండు లంగ్సు పూర్తిగా చెడిపోయినయ్ అంటున్నాడు డాక్టర్. బ్రతికితే ఇంకొక వారం రోజులు అని గట్టిగా చెప్పాడు కూడా! సరే అరుణా! అంతా నా గోడక వ్రాసి నీ మనసుని నొప్పిస్తున్నానా! పోనీ ఆప్యాయంగా ఒక వుత్తరం వ్రాయకూడదూ! చివరి దశలో - నిన్ను కనులారా చూడలేక పోయినా- కనీసం నీ వుత్తరం చదువుకొని- హాయిగా కన్ను మూస్తాను! ఇది కేవలం నా మనశ్శాంతి కోసమే- ఈ వుత్తరం చదివేదాకా నేను నీకు గుర్తుకు రానని తెలుసు- నీకు నా మీద ప్రేమగాని - ఇష్టం కాని లేవని తెలుసు. అవి - ఈ క్షణంలో నీ నుంచి ఆశించను కూడా! కనీసం- ఈ అజ్ఞాత ప్రేమికుడి మీద జాలి చూపు అరుణా! చివరికి సానుభూతిగా నయినా వ్రాస్తావ్ కదూ....

ఆఖరి క్షణంలో పొందే ఆనందం- నా అరుణ నుండే పొందాలని ఆశించే అభాగ్యుడు-

ఎవరికీ ఏమీ కాని

ప్రభాకర్

రెండు కన్నీటి బొట్లు- 'టప్' మని ఆ వుత్తరం మీద పడటం గమనించి వులిక్కి పడింది అరుణ.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది. ఆ వుత్తరాన్ని అక్కడున్న మేగజైన్‌లో పెట్టి-ఫోనందుకుంది అరుణ.

"హలో డియర్! ఏం చేయటంలేదు- మామూలే! ఏమిటి ఇంకో పావుగంటలో రాబోతూ ఇప్పుడు ఫోన్ చేశారు? ఏమైనా విశేషమా?"

''విశేషమనుకుంటే విశేషమే! ఇవాళ ''లిబర్టీ'' లో దేవానంద్ ఫిలిమ్‌కి వెళ్ళబోతున్నాం- నేనూ, నా భాగ్యలక్ష్మివి నువ్వూ. టికెట్స్ బుక్ చేయబోతున్నాను! ముందే దేవివారికి వార్నింగ్ యిస్తే- నేను వచ్చే లోపల తయారవుతారని నా ఆశ! - అంతే- ఎనీ మోడిఫికేషన్స్ ఆర్ సజెషన్స్ ప్లీస్!''

''మీరొక్కరే వెళ్ళకూడదూ! నాకివాళ ఒంట్లో బాగుండలేదండీ!''

''సరేలే సౌదభ్యం! నీకు సినిమా అంటే ఒంట్లో బాగుండదు! నా ఫ్రెండ్స్ ఎవరూ రావటం లేదులే - దిగులు పడకు! అది ఆషామాషీ ఫిలిమ్ కాదు! దేవానంద్ ఫిలిమ్ - కనుక తయారుగా వుండు - ఓకె?''

ఫోన్ పెట్టేసి నిట్టూర్చింది అరుణ. కాఫీ ఫ్లాస్కూ, గ్లాసూ బల్ల మీద పెట్టి- బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది స్నానానికి.

తనకి ఈ రోజు వరకూ ఆ ప్రభాకరమే గుర్తులేదు. తన క్లాస్‌లోని - అరవై మందిలోనూ అతనొకడు. తనకు వచ్చిన ఎన్నో ప్రేమలేఖల్లో అతనిదీ వుండవచ్చు. అంతకన్నా తనకేమీ అతని గురించి తెలియదు- గుర్తులేదు. తనకి తెలియ కుండానే- తనవల్ల బాధపడ్డాడన్నమాట. దానికి ఏ విధంగానూ తను బాధ్యురాలు కాదే! ఎంతోమంది- తన ముందు వెకిలి వేషాలు వేసేవాళ్ళు- ప్రేమనీ, పెళ్ళనీ వుత్తరాలు వ్రాసేవాళ్ళు-తనంటే తపించి పోయేవాళ్ళు. అందరితోపాటు ఇతన్నీ కసిరి కొట్టింది. తన తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాన్నే ఖాయం చేసింది- అతన్నే వివాహం చేసుకుంది! సుఖంగా వుంటున్నది! అలాటిది అతని కష్టాలకీ- బాధలకీ తనే విధంగా బాధ్యురాలు?

పెళ్లయి కాపరం చేసుకుంటున్న స్త్రీ తనని ప్రేమించిన పరాయి పురుషుడ్ని - ఏ విధంగా లాలించ గలదు. అతను రోగిష్టే అవొచ్చు. ఇవాళో రేపో పోవటానికి సిద్దంగా వుండవచ్చు. అటువంటప్పుడు మాత్రం -ఏ భర్త - తన భార్యని ప్రోత్సహిస్తాడు? అతనంటే జాలి కలగటం సహజమే! మరి! .....పోనీ! తన భర్తకి తెలియకుండా వుత్తరం వ్రాస్తే! అసంభవం! తనని ప్రాణాధికంగా ప్రేమించిన భర్త తనతో ఆఫీసులో జరిగిన చిన్న విషయాల నుంచీ దాపరికం లేకుండా చెప్పే భర్త - తన భర్తను వంచించలేదు. అది తన మనోదౌర్బల్యానికే కారణం అవుతుంది. తన భర్తను వంచించటం తనని వంచన చేసుకోవటమే అవుతుంది. తన భర్తకి అన్ని విషయాలు సాకల్యంగా చెప్పేస్తే - ఆయనకి తనమీద ఎన్నో అనుమానాలు రావచ్చు. పండింటి తన సంసారం నాశనం అయిపోతుంది. ఇప్పుడు ఏం చేయాలి? తన బుర్ర పగిలిపోతున్నది. చన్నీళ్ళతో స్నానం చేసి బయట పడింది.

చీర కట్టుకుని-జడ అల్లుకుంటూ వచ్చిన అరుణకు - హాల్లో కృష్ణమూర్తి కనబడ్డాడు. ఎటో దూరంగా చూస్తూ- సిగరెట్ తాగుతున్నాడు. బల్ల మీద -అతను తెచ్చిన మల్లెపూల పొట్లం - ప్రక్కన మేగజైన్ - ప్రక్కనే గ్లాస్‌లో సగం త్రాగిన కాఫీ చల్లారి పోయివుంది.

లేని చిరునవ్వును తెచ్చుకుంటూ ''ఏమిటి శ్రీవారు ఇంకా తయారవలేదు ఫిలిమ్‌కి! కాఫీ కూడా వదిలేశారు. ఏమిటి కథ?''అంది అరుణ.

విసురుగా వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటి సార్! నేను సినిమాకి రానన్నాననేగా ఈ కోపం! ఈసారికి మీరు వెళ్ళండి. నెక్స్ట్ వీక్ ఇద్దరం కలిసే వెళ్దాం" కృష్ణమూర్తి ప్రక్కనే కూర్చుంటూ అన్నది అరుణ.

"ప్లీస్! నన్ను విసిగించకు అరుణా! నాకు తలనొప్పిగా వుంది", మేడ మీదికి వెళుతూ అన్నాడు కృష్ణమూర్తి.

అరుణకేమీ అర్థంకాలేదు.

ఆ రోజు భోజనాల దగ్గరా ముభావంగానే వున్నాడు కృష్ణమూర్తి

మేడ మీద పుచ్చ పువ్వు లాటి వెన్నెల్లో - మంచం మీద పడుకొని చంద్రుణ్ని చూస్తున్న కృష్ణమూర్తి పక్కనే కూర్చుంది అరుణ. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అంది అరుణ.

" ఏమండీ! కొత్తగా ప్రారంబిస్తున్న మాసపత్రిక ఎడిటర్ ఏదన్నా కథ పంపించమని వ్రాశాడు. ప్లాట్ దొరికింది కాని ఎండింగ్ చేత కావడం లేదు. మీ ఎక్స్‌పర్టు ఒపీనియన్ కావాలి నాకు! సరేనా!"

నిర్లిప్తంగా ఒక పక్కకు జరిగి పడుకున్నాడు కృష్ణమూర్తి.

"బతిమిలాడించుకోకుండా వినండి మరి!" అతని ప్రక్కనే పడుకుంటూ అన్నది అరుణ.

ఆమె తలలోని మల్లెలు గుబాళిస్తున్నాయ్!

"అనగనగా ఒక కాలేజి బ్యూటీ! మామూలుగానే రోజా ప్రేమలేఖలు వగైరా- రాద్ధాంతం కాని ఆమెకి ఇవేం నచ్చేవి కావు. వచ్చిన ప్రేమ లేఖల్ని చూడనన్నా చూడకుండా పొయ్యిలో పడేసి కాఫీ కలుపుకు త్రాగేది! కొన్నాళ్ళకి అమెకు పెళ్ళయింది. భర్త ఆమెని ప్రాణాధికంగా ప్రేమించాడు! ఆమె కూడా ఏమీ తక్కువ తినలేదు. ఫలితంగా ఆమె సంసారం పచ్చగా మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వుంది. వాళ్ళ అన్యోన్యత ఎంతదాకా పోయిందీ అంటే- వాళ్ళ మధ్య ఏమీ దాపరికాలు లేవు! ఇంతలో ఆమెకో ఉత్తరం వచ్చింది. ఆ వుత్తరం వ్రాసిన అతను ఆమెకి ఓల్డు క్లాస్‌మేట్! అతను ఆ అమ్మాయిని ప్రేమించాడు. కాని అతను కూడా అందరిలాగే అదే పాట పాడుతున్నాడనుకున్న ఆ అమ్మాయి అతన్ని లక్ష్యం చేయలేదు. కాని అతను ఆమెను నిజంగానే ప్రేమించాడు. ఆమెకి పెళ్ళవగానే అతను పిచ్చివాడిలా తయారయ్యాడు. ముందు తనని కాదన్న ఆమె జీవితాన్ని నాశనం చేద్దామనుకున్నాడు. కాని ఆమె సుఖమే తన సుఖమనుకున్నాడు. ఇంతలో అతని ఆరోగ్యం చెడింది. త్వరలో చనిపోతాడని డాక్టర్ మొఖమాటం లేకుండా చెప్పాడు. ఈ సమయంలోనే ఆమె కతను వుత్తరం వ్రాశాడు. కనీసం తనకి ఆఖరి చూపు ఇవ్వలేకపోయినా ఆప్యాయంగా ఓ వుత్తరం వ్రాయమని - ఆమెకేం చేయాలో తోచలేదు. నిజంగా ఆమెకతనెవరో కూడా అంతగా గుర్తులేదు."

"అతనెవరో కూడా గుర్తులేదా?" మధ్యలో అడిగాడు కృష్ణమూర్తి.

"గుర్తు లేదంటే లేదని కాదు! ఆమె దృష్టిలో అతను ఓల్డు క్లాసమేట్ మాత్రమే! అందరితో పాటూ అతన్ని మర్చిపోయింది. ఇప్పుడు వుత్తరం చూసినప్పుడు మాత్రమే-

అతనంటూ ఒకడున్నాడని గుర్తుకొచ్చింది!''

"ఇప్పుడామె ప్రాబ్లెమ్ ఏమిటి?'' అడిగాడు కృష్ణమూర్తి.

"ఏమీ దాపరికం లేకుండా-అన్యోన్యంగా వున్న భర్తకి తెలీకుండా అతనికి- ఒక పరాయి పురుషుడికి ఆ రకంగా వుత్తరం వ్రాసి ఆత్మద్రోహం చేసుకోలేదు. భర్తకి అంతా చెబితే అ వుత్తరం ధోరణిని బట్టి ఆమెని అపార్థం చేసుకోటానికి అవకాశం వుంది. అప్పటికిదాకా హాయిగా వున్న కుటుంబంలో అశాంతి మొదలవుతుంది. భర్త ఎంత డీప్‌గా అలోచించి సర్దుబాటు చేసినా అతనిలో అనుమానపు భూతం ప్రవేశించక మానదు! అతన్ని దావాగ్నిలా దహించకామానదు! ఎలా చూసినా ఆమె కాపురానికే నష్టం!''

"పోనీ-ఉత్తరం వ్రాయటం మానేస్తే?'' అడిగాడు కృష్ణమూర్తి అదోరకంగా- ఆమె వేపు తిరుగుతూ.

అరుణ ఏమీ మాట్లాడలేదు.

"ఏం! ఆమెకూడ ఒకప్పుడతన్ని ప్రేమించి-క్రమేణా పెళ్ళయిన తరువాత మరచిపోయిందా! అందుకనే ఉత్తరం వ్రాయకుండా వుండలేకపోతున్నదేమో''. ఆమె కళ్ళల్లో సుళ్ళుతరుగుతున్న నీటిని స్పష్టంగా చూశాడు కృష్ణమూర్తి.

"అదేంలేదు! ఆమె కాసమయంలో ప్రేమంటే తెలియదు! ఆదే తెలుసుంటే తనని ఆరాధించే అరవై మందిలో ఎకడ్నో ఒకణ్ణి ప్రేమించి, పెళ్ళిచేసుకునేదే!- కాని ఇప్పుడు...'' మాత్రం అతనంటే ఎందుకో బొంగురుపోయింది.

"జాలి మాత్రం ఎందుకు కలగాలి?'' సూటిగా అడిగాడు కృష్ణమూర్తి.

ఆమె ఏమీ మాట్లడ లేదు. కళ్ళు మూసుకున్నదొకసారి.

కృష్ణమూర్తి ఆమె తెల్లని ఎత్తయిన బుగ్గల మీద కన్నీరు తుడిచాడు.

"పిచ్చిదానా! జాలెందుకు కలగాలో చెప్పనా! సాటిమానవుడు- ఆఖరిదశలో చనిపోతూ అర్థించాడు కాబట్టి! తన జీవిత మంతా 'అరుణా అరుణా' అంటూ నీ నామ స్మరణతోనే గడిపి చివరికి నిన్ను తలచుకుంటూనే మరణించనున్నాడు కాబట్టి! చివరి కోరిక తీరకుండా చనిపోతే- అతని ఆత్మకు శాంతి వుండదని చెబుతారు. బ్రతికినన్నాళ్లూ-సుఖంలేని అతని ఆత్మకు కనీసం చనిపోయిన తరువాతైనా శాంతిని లభ్యం చేయటం-మానవ లక్షణం-మన ధర్మం. కనుక నువ్వేమీ విచారపడకు! రేపు ప్రొద్దున్నే మనిద్దరం అతని దగ్గరకు పోదాం - కనీసం చివరి ఘడియల్లోనయినా తృప్తిగా కన్ను మూస్తాడు మానవుడు! సరేనా - అసలు సంగతి మర్చిపోయాను అరుణా - నీకు తెలియకుండా మేగ్‌జైన్‌లోని నీ ఉత్తరం చదికినందుకు-నన్ను క్షమిస్తావ్ కదూ!''

చటుక్కున వంగి- కృష్ణమూర్తి పాదాలకు నమస్కరించింది అరుణ.

" ఛ ఛ! ఇదేమిటి - సతీ సక్కుబాయిలాగా- లేలే''

ఆమె తలలోని మల్లెలు మత్తుగా మూలిగినయ్!

అరుణ అరుణాధరాలతో - తన పెదవులు కలపబోతున్న కృష్ణమూర్తిని చూసి సిగ్గుపడి- మేఘాల చాటుకి వెళ్ళి పోయాడు- చందమామ.